
సూర్య ఆదివారం
19.1.2025



### ఆధునిక క్రికెటర్లు అందుకోలేనంత ఎత్తులో

# బాపూ నాదకర్ణి రికార్డ్

# చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**వైఎస్సార్‌సీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్ బయల్దేరి వెళ్లారు. లండన్ పర్యటనకు వెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు వీడ్కోలు పలికారు. అయితే సీఎం జగన్ లండన్ వెళ్లే సమయంలో.. ఎయిర్‌పోర్ట్‌లో డాక్టర్ ఉయ్యూరు లోకేష్ కుమార్ అనే వ్యక్తి అనుమానాస్పందగా కనిపించడంతో.. వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసలు ఏం జరుగుతోంది. కాస్త వివరించండి సార్**

**–– కె. చంద్రశేఖర్, విజయవాడ**

అవును చంద్రశేఖర్ గారూ  ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లండన్ పర్యటనకు వెళ్లే సమయంలో కలకలంరేగిందన్నది వాస్తవం. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని గుంటూరు జిల్లా వెంకటాయపాలెంకు చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ ఉయ్యూరు లోకేష్ కుమార్‌గా గుర్తించారు. విమానాశ్రయంలోని వాహనాల పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులకు అనుమానం వచ్చింది.. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. లోకేష్‌ను పోలీసులు ప్రశ్నించగా.. గుండెపోటు వచ్చినట్లు లోకేష్ చెప్పారు. ఆయన అక్కడే పడిపోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయతే ముఖ్యమంత్రి జగన్ విదేశీ పర్యటనపై డాక్టర్ల లోకేష్ మెసేజ్‌లు పంపినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. సీఎం జగన్ లండన్ వెళ్లే సమయంలోనే ఇలా జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. లోకేష్ కోలుకోగానే పోలీసులు ప్రశ్నించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న డాక్టర్ లోకేష్ కుమార్‌కు అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉంటున్నట్లు గుర్తించారు.. ఆయన డాక్టర్‌గా సేవలు అందించి రిటైర్ అయ్యారట. అలాగే లోకేష్‌కు అమెరికన్ పౌరసత్వం ఉన్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు సంబంధించిన కొన్ని మెసేజ్‌లను కొందరికి పంపినట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ విదేశీ పర్యటనకు డాక్టర్ లోకేష్ కుమార్‌కు సంబంధం ఏంటి.. జగన్ లండన్ వెళ్లే సమయంలో ఎందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చాడు..? ఏపీ సీఎం విదేశీ పర్యటనకు సంబంధించిన మెసేజ్‌లను ఎవరికి పెట్టాడు..? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. మరోవైపు లోకేష్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. తనను జగన్ పోలీసులు కిడ్నాప్ చేసి, కొట్టి, బెదిరించి ఏదో ఒప్పుకోమని లేకపోతే.. ఏదైనా చేయగలమని ఒక 20మంది పోలీసులు వచ్చారన్నారు. అక్కడికి వచ్చిన పోలీసులకు బాడ్జ్‌లు, పేర్లు లేవన్నారు. తన అమెరికా ఐఫోన్ తీసుకుని తన మెసేజ్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు చదివారని, మెయిల్స్‌లో ఫోటోలు తీసుకున్నట్లు ఆరోపించారు.

**తాజ్ మహల్ ఒక.. కొన్ని శతాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచింది. . అయితే ఇప్పుడు అదే ఆగ్రా నగరంలో.. తాజ్ మహల్‌కు సమీపంలోనే మరో అద్భుతమైన పాలరాతి కట్టడం నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చింది.  ఇందుకు సంబంధించిన వివరాలు చెప్పండి**

**– పాలమంత విద్యాసాగర్, హైదరాబాద్**

అవును మీరు విన్నది నిజమే విద్యాసాగర్ గారూ....  ఇప్పుడు ఆ కట్టడమే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అదే శివ్ దయాళ్ సింగ్ పాలరాతి సమాధి. ఇది  ఆగ్రా  . తాజ్ మహల్‌కు 12 కిలోమీటర్ల దూరంలో స్వామి బాగ్ కాలనీలో  పాలరాతి సమాధిని కట్టారు. రాధాస్వామి అనే ఆధ్యాత్మిక సంప్రదాయానికి పునాది వేసిన శివ్ దయాళ్ సింగ్‌కు సంబంధించిన పాలరాతి సమాధి ఇప్పుడు తాజ్ మహల్‌కు గట్టి పోటీని ఇస్తోంది. ఈ కట్టడాన్ని చూసేందుకు భవిష్యత్‌లో దేశ, విదేశాల నుంచి భారీగా సందర్శకులు వస్తారని స్థానికులు చెబుతున్నారు.అయితే ఈ శివ్ దయాళ్ సింగ్ సమాధి నిర్మాణం పూర్తి కావడానికి 100 ఏళ్లు దాటడం గమనార్హం. ఈ సమాధి నిర్మాణ పనులు 1904 లో ప్రారంభమయ్యాయి. అయితే ఆ తర్వాత ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు ఎదురై ఆగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ 1922 లో తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి కొద్దికొద్దిగా జరుగుతున్న ఆ నిర్మాణ పనులు.. సుదీర్ఘ కాలంగా సాగుతూ ఇప్పుడు చివరి దశకు వచ్చాయి. ఇంకా ఆ నిర్మాణానికి చిన్న చిన్న పనులు మిగిలి ఉండగా.. ప్రస్తుతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.రకరకాల నిర్మాణ శైలిలను ఆధారంగా చేసుకుని నిర్మించిన ఈ కట్టడం తాజ్ మహల్‌కు గట్టి పోటీ అని నిర్మాణం చేసినవారు చెబుతున్నారు. రాజస్థాన్‌లోని మక్రానా, జోధ్‌పుర్‌ల నుంచి తెచ్చిన పాలరాతితో ఈ నిర్మాణాన్ని ఏకంగా 193 అడుగుల ఎత్తు నిర్మించారు. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలతోపాటు వివిధ దేశాలకు చెందిన లక్షలాది మంది రాధాస్వామి సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇప్పుడు వారంతా ఈ శివ్ దయాళ్ సింగ్ సమాధిని సందర్శించుకు నేందుకు వస్తున్నారు. అయితే ఇది తాజ్‌మహల్‌కు పోటీ కాదంటూ కొందరు కొట్టిపారేస్తున్నారు.

# లెజెండ్

## సకల కళానిధి టంగుటూరి



భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్య కారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొంద డానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె.టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రి లో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏట నుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని,  పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయం లోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడం చేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూం డడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనే వారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె  సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ  మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్త పోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్ట దీపుడు,  మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికా దేవిగా నాటకాల్లో నటించేది.లలిత గీతాలు యాభై, దేశభక్తి గీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి.నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వ లేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీక రించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది. పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకు రాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను  తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్టావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో, వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువు గారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె  పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకు రావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరం బాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది.  వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వం దోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూని వర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది.  సూర్యకుమారి ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది.ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె.  నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలల పాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంజర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి  దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యా సంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది.
1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

### అభిలాష!!



అఖిల తారలు
నీ పదపద్మములనుజేరి
అమితానురక్తితో కొల్చుటజూచి
పూటపూటనా ఇలాగ
మినుకుమినుకుమని మెరుస్తుంటి!
విశాలాకాశానున్న నక్షత్రమండలాన
నేటికిలా చుక్కనై ఉదయించితి
ఇన్నాళ్లూ ప్రవేశం నిషేదించితివి
తగననా నీ పవిత్ర పాదపూజకు?
తూర్పుదిశను దొరికించుకొని
ఆకాశానికి మిక్కిలి శ్రమతో
ప్రాకిప్రాకి
పశ్చిమసంద్రంలో పడిమునిగి
మరలమరల ఉదయాస్తమయాల
చట్రంలో తిరగుతున్నా, ఇంతేనా
బ్రతుకు?

భవసాగరమును తప్పుకొనుటకు
తగిన ఉపాయం దొరకదా
ఊరట కలగదా నీకిష్టమైతే
నీ చల్లని చూపు సోకితే మాత!
తారలందరూ నడిచిన త్రోవలను
వారు చేసిన ఆరాధనల తీరునిజూచి
అనునిత్యం నీ సేవలో తరించాలని
తత్తరపడుతున్న పసితారకను!
ఆత్మపీఠమందు సదా నిన్నుంచి
నిష్ఠతో సర్వదా అర్చించదలచితినే
నా ఆశ పేరాసనకుమమ్మా
నను కరుణించి బ్రోవుమమ్మా
నువ్వు తప్ప నాకెవ్వరే దిక్కమ్మా?
ఓ నిఖిలజననీ ఆదిశక్తీ పరాశక్తీ!!

**రవి కిషోర్ పెంట్రాల, లాంగ్లీ, లండన్! 0044-07703327908**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

జాతీయ విద్యా దినోత్సవంపై సంపూర్ణ వ్యాసం సందేహాలు నివృత్తి అయ్యేలా ప్రచురించిన వ్యాసం చాలా బాగుంది . ఇలాంటి వాస్తవిక కథనాల ప్రచురణలో సూర్య ఆదివారం అనుబంధం ఎప్పటికీ ముందుండటం అభినందనీ యం. ఈ తరహా కథనాలు గత చరిత్రను తెలుసుకునే కొనసాగుతున్నాయి. ఇలాంటి వాటిని మరిన్ని ప్రచురించాలని మనవి. ఈ తరహా వ్యాసాలు పూర్తి స్థాయిలో మరిన్ని వెలువ రించాలని కోరుకుంటు న్నాం. రచయితకు, ప్రచురించిన సంపాదక వర్గానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురిం చాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవా దాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**




వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**


వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## కనుమరుగవుతున్న పల్లె తత్వం


అచ్చమైన ప్రకృతి సోయగాలతో
స్వచ్ఛమైన జీవజల ధారలతో
కాలుష్య రహితమైన స్వచ్ఛ
గాలులతో
ప్రశాంతమైన జీవనాన్ని
సాగించడే...పల్లె తత్వం
పంటనిచ్చే పైరుల పచ్చదనంతో
కిలకిల ధ్వనించే పక్షుల రాగాలతో
పాడినిచ్చే పశు గొట్టాల అంబా
శబ్దాలతో
కలిసిమెలిసి హాయిగా
జీవించడమే...పల్లె తత్వం
బ్రహ్మ ముహూర్తాన్నే లేచి చల్లే
కళ్ళాపు చప్పుళ్ళతో
సూర్యోదయంతోనే పొలమెళ్ళే రైతు
కూలీల హడావుడితో
మేతకోతలకు బైదెల్లే ఎడ్లబళ్ల పశు
వుల సద్దుతో
ప్రాతః కాలాన్నే నిద్ర లేవడమే...పల్లె
తత్వం.
తాతా మామ్మ అమ్మ నాన్నల
మమకారంతో
అన్న తమ్ముడు అక్కా చెల్లెళ్ళ
వాత్సల్యంతో
అత్త మామ మేనల్లుడు మేనకోడల్ల
అభిమానంతో
కుటుంబ బంధాలను
వికసింపజేసుకోవడమే...పల్లె తత్వం
అరమరికలు దాపరికాలు లేని
ఆలోచనలతో
కోపద్వేష అసూయలు క్షణికమయ్యే
మనసులతో
ప్రేమ జాలి దయ లాంటి
భావోద్వేగాలతో
స్వచ్ఛమైన మనుషులుగా
జీవించడమే...పల్లె తత్వం
అందరికీ అన్నం పెట్టే కమ్మని
అమ్మతనంతో
బంధుత్వాలతో పలకరించుకునే
ఇరుగుపొరుగుతో
కష్టసుఖాలలో కలిసుండే మానవ
విలువలతో
నైతిక జీవన విధానానికి
నిదర్శనమే%ొ%పల్లె తత్వం
ఎవరింట పండగైనా
అందరిదనుకునే సంబరాలతో
కలిసికట్టుగా చేసుకునే పిండి
వంటల గుమగుమలతో
చిన్నా పెద్ద కూర్చుని చెప్పుకునే
సరదా కబుర్లతో
ప్రతిరోజూ ఒక పండుగలా
బ్రతకడమే...పల్లె తత్వం
మేతకెళ్ళి తిరిగొచ్చే పశువుల గిట్టల
శబ్దాలతో
పొలమెళ్ళి తిరిగొచ్చే రైతు కూలీల
ఒడివడి నడకలతో
పొద్దుగూకి తిరిగొచ్చే నాగళ్ళ
ఎడ్లబళ్ల సవ్వడులతో
మెల్లగా నిశ్శబ్దంగా నిద్రలోకి
జారకోవడమే %ొ%పల్లె తత్వం
అయితే,సాంకేతిక పరిజ్ఞాన
అభివృద్ధితో
సామాజిక మాధ్యమాల ప్రభావంతో
అంతర్జాలం చేసే చేతిదర్శిని
మాయాజాలంతో
వేగవంతమౌతున్న ప్రపంచీకరణ
నేపథ్యంతో
తన సాంస్కృతిక నేపథ్య మూలాలను
కోల్పోతూ...
క్రమక్రమంగా"నుమరుగుతున్నది...
అమ్మని మరిపించే కమ్మని పల్లెటూరి
పల్లెతత్వం

**ననుబోలు రాజశేఖర్, 330969808**










# సూర్య బుడత

బాలల కథ

## తెలివైన పని




నల్లమల అడవికి దగ్గరగా రామాపురం అనే గ్రామం ఉంది. ఆ గ్రామ పొలాల్లో జింకల గుంపు సంచరిస్తూ ఉండేది. వేసిన పంటలపై పడి తింటూ నాశనం చేసేది. 'ఇలాగైతే మన పంటలు మన చేతికిరావని' ఆ గ్రామ రైతులందరూ కలిసి జింకల గుంపును నల్లమల అడవుల్లోకి తరిమేశారు. జింకలన్ని అడవిలోకి పరుగెత్తాయి. అలసిపోయి నీళ్ళ కోసం వెతికాయి. వాటికి ఒక గుంతలో నీళ్ళు కనిపించాయి. అప్పటికే ఆ గుంతలో ఒక చిరుత పిల్ల పడి బయటకు రాలేక గిలగిల కొట్టుకుంటుంది. దాన్ని చూసిన జింకలు బయటకు తీశాయి. నీళ్ళు తాగి ముందుకు కదిలాయి. వెళుతూ వెళుతూ ఉండగా ఒక బావిలాంటి గుంతలో నుంచి పెద్దగా నీళ్ళ చప్పుడు వినిపించింది. ఏంటబ్బా అని జింక పిల్ల వెళ్లి తొంగిచూసింది. అక్కడ ఒక పెద్ద పులి బయటకు రాలేక కొట్టుకుంటుంది. "అమ్మా దీన్నీ కాపాడమ్మా" అని తల్లి జింకను పిలిచింది.


జింక బావిలోకి చూసి, "దీన్ని కాపాడితే మన ప్రాణాలకే ముప్పు. అది మనల్నే చంపి తింటుంది. పోదాం పద"అంది. "మరి అక్కడ చిరుత పిల్లను కాపాడావే!" అని జింక పిల్ల అడడగా "అది చిన్న కూన దాని వల్ల మనకు ఏ ప్రమాదమూ ఉండదని కాపాడామని"అంది. పోతూపోతూ కాలువ నీళ్ళను బావిలోకి మల్లించింది. ఇదిచూసిన తోటి జింక "ఎందుకు పులిని కాపాడావు. దానివల్ల మనకు హానీ కదా?" అడిగింది. "రోజురోజుకు అడవులు అంతరించి పోతున్నాయి. ఇలాంటి పెద్ద పులులు ఉంటే అడవికి రక్షణగా ఉంటాయి. బావి నిండి అది పైకి వచ్చేలోగా మనం దానికి అందనంత సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోతాం"అంది జింక. అడవిలో అవి ఆనందంగా గడపసాగాయి.


........ **ఆవుల చక్రపాణి యాదవ్**

**9963350973**



| | | | | | |
|---|---|---|---|---|---|
| 5 | | | | 4 | |
| | | 3 | 5 | | |
| | | 4 | | | 5 |
| 6 | | | 4 | | |
| | | 5 | 3 | | |
| | 1 | | | | |



ఈవారం కథ

# నేటి సమాజం

విలువలతోవెంకట్ ఒక గవర్నమెంట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు...రోజూ బైక్ లో ఆఫీసుకి వెళ్లడం, సాయంత్రం ఆఫీసు నుంచి నేరుగా ఇంటికి రావడం...సిటీకి కొత్తగా రావడం వలనఆప్యాయంగా పలకరించే వారు ఎవరూ లేరు తనకు, డ్యూటీ తరువాత తన భార్యతో కలిసి కాసేపు అలా అలా తిరిగి రావడం అంతే...
హడావుడిగా పరుగులు తీసే జనాలు
ఎవరి అవసరం వారిది, ఎవరి పనులు వారివి. ఒక్కరికీ ఆగి ఆప్యాయంగా పలకరించే సమయం లేదు.
సిటీ కదా... ఇంతేనేమో అనుకుంటూ రొటీన్ గా తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు.
రోజులను బిజీగా గడిపేస్తున్నాడే గానీ, జీవితంలో ఏదో తెలియని వెలితి. బహుశా ఆ వెలితి అందరిలోనూ ఉందనుకుంటా, కానీ పైకి కనబడకుండా లేని పనిని కల్పించుకుని బిజీగా ఉన్నట్టు నటిస్తూ వాస్తవానికి దూరంగా పారిపోతున్నట్టున్నారు...

ఒకరోజు సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తూ, యధాలాపంగా రోడ్డు పక్కన కూర్చున్న ఒక ముసలావిడను చూసాడు. ముందు చిన్న బుట్ట పెట్టుకుని ఏదో అమ్ముతోంది. దగ్గరకు వెళ్ళి చూసాడు...
బుట్టలో సపోటా పండ్లు పెట్టి అమ్ముతోంది. బాగా వయసు మళ్ళిన వృద్ధురాలు, ఈ వయసులో కూడా ఎంత కష్టపడుతోంది అనిపించింది వెంకట్ కి. కానీ ఒక్కరూ ఆవిడ దగ్గర ఆగి పండ్లను కొనడం లేదు, అసలు అక్కడ ఒక మనిషి కూర్చుని ఉందన్న విషయం కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా బాధ కలిగింది తనకు,బండి ఒక ప్రక్కగా ఆపి ఆమె దగ్గరకు వెళ్ళాడు.
"ఎలా అమ్మా సపోటాలు, కిలో ఎలా ఇస్తున్నావ్" అనడిగాడు.
ఆమె రేటు చెప్పింది...
సరే ఒక కిలో ఇవ్వు అన్నాడు.
ఆమె ఒక కిలో తూచి సంచిలో వేసి ఇచ్చింది.



సంచిలోనుంచి ఒక పండు తీసి తిని, "ఏంటమ్మా అస్సలు తియ్యగా లేవు పండ్లు" అంటూ ఇంకో పండు సంచిలోనుంచి తీసి ఆమెకిచ్చాడు. ఆమె ఆ పండు తిని" అదేంటి నాయనా... పండు తియ్యగానే ఉంది కదా" అంది.
సరేలే అంటూ డబ్బులిచ్చి ఇంటికి బయలుదేరాడు.
ఆరోజు మొదలు ప్రతీరోజూ
ఆమె దగ్గర ఆగడం, ఒక కిలో సపోటాలు కొనడం, సంచిలోనుంచి ఒక పండు తీసుకుని తిని రుచిగా లేదు అని చెప్పడం, కావాలంటే నువ్వే చూడు అని ఆమెకు ఒక పండు ఇవ్వడం, ఆమె తిని బావుంది కదా అంటే డబ్బులు ఇచ్చి ఇంటికి వెళ్లడం - దినచర్య అయిపోయింది వెంకట్ కి.
ఒకరోజు తన భార్యతో కలిసి వెళుతూ ఆగాడు ఆమె దగ్గర...
ఎప్పటిలానే కిలో పండ్లు తీసుకున్నాడు. సంచిలోనుంచి ఒక పండు తీసుకుని తిని, పండ్లు తియ్యగా లేవని చెప్పి తన సంచిలోనుంచి ఒక పండు తీసి ఆమెకిచ్చాడు. ఆమె పండు తిని తియ్యగానే ఉన్నాయి కదా నాయనా అని చెప్పగానే డబ్బులిచ్చి బయలుదేరాడు. ఇదంతా చూసిన వెంకట్ భార్యకు కోపం వచ్చింది.
ఇంటికి వెళ్లాక
"రోజూ నువ్వు తీసుకుని వచ్చే పండ్లు చాలా తియ్యగా ఉంటాయి, ఎందుకని ఆవిడకు అబద్ధం చెప్పి బాధపెట్టావ్... పాపం కదా అసలే పెద్దావిడ" అనడిగింది.
వెంకట్ చిరునవ్వు నవ్వి
"ఆమె దగ్గర పండ్లు తియ్యగానే ఉంటాయని నాకూ తెలుసు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆవిడ ఆ పండ్లన్నింటినీ అమ్మడానికి కూర్చుంటుందే కానీ, ఒక్క పండు కూడా ఆమె తినదు. అలా అని నేను కొన్న పండ్లు ఆమెకు తినడానికి ఇస్తే ఆమె తీసుకోకపోవచ్చు. అందుకే అలా అబద్ధం చెప్పి, రోజూ ఆమె తినడానికి ఒక పండు ఇస్తున్నా"అని అసలు విషయం చెప్పాడు...
వెంకట్ తన భార్యతో కలిసి వెళ్లిపోగానే వృద్ధురాలికి కొంచెం దూరంలో కూరగాయలు అమ్మే ఒకామె వృద్ధురాలి దగ్గరకు వచ్చి
" రోజూ చూస్తున్నాను... ఆ అబ్బాయి వస్తాడు, పండ్లు కొంటాడు. బాగాలేదని మొహం మీదే చెబుతాడు. అయినా కూడా రోజూ నువ్వు ఒక పండు ఎక్కువ తూయడం నేను చూస్తూనే ఉన్నా. అటువంటి వాడికి రోజూ ఒక పండు ఎందుకు ఎక్కువిస్తున్నావ్" అని అడిగింది.
వృద్ధురాలు చిన్నగా నవ్వి చెప్పింది
"పిచ్చిదానా... నేను తీసుకొచ్చే పండ్లన్నీ తియ్యగానే ఉంటాయని నాకు తెలుసు, అయినా తియ్యగా లేవని అబద్ధం చెప్పి కావాలనే రోజూ ఒక పండు నాచేత తినిపిస్తున్నాడు. ఆ అబ్బాయి చూపిస్తున్న ప్రేమకు ఆప్యాయతకు తెలియకుండానే ఒక పండు దానంతటదే ఎక్కువ తూగుతోంది" అని. నిజంగా ఇలాంటి చిన్న చిన్న విషయాలలో ఎంతో ఆనందం దాగుంటుంది కదా. అన్ని ఆనందాలనూ డబ్బుతో కొనలేం, ఎదుటివారి పట్ల ప్రేమ ఆప్యాయతలే జీవితంలో నిజమైన తియ్యదనాన్ని నింపగలవు. మనిషికి ఉండవలసిన ఉదార స్వభావం కనుమరుగైపోతోంది. ఇవ్వడంలో ఉన్న ఆనందం, తీసుకోవడంలో దొరకదు. ఆనందం పంచితే పెరుగుతుందే గానీ తగ్గదు.
అన్నీ ఉన్నా కూడా ఈరోజుల్లో ఆప్యాయంగా పలకరించే వారు లేకుండా పోతున్నారు. ఆప్యాయంగా పలకరించడానికి ఎదుటివారితో మనకు బంధుత్వమే ఉండనవసరం లేదు, అందరూ ఆప్తులే అని చెప్పడం కోసమే ఈ చిన్న కథ. ఈ కథ చదివి ఆప్యాయత ఎంతో అవశ్యం

**ఉమశేషారావు వైద్య**
**9440408080**

# కిస్ మిస్లు తినకపోతే.. మీరు ఈ లాభాలు మిస్ అయినట్లే !

ఎండు ద్రాక్షలు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. వీటిలోని పోషకాలు ఆరోగ్య సమస్యలు రాకుండా చేస్తాయి. ప్రజలు ఎక్కువగా నీటిలో నానబెట్టిన ఎండుద్రాక్షను తింటారు. వీటిని తినడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.
పాలలో ఎండు ద్రాక్షను నానబెట్టి తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని మీకు తెలుసా. ఇలా చేయడం వల్ల ఎండు ద్రాక్షల్లోని పోషకాలు రెట్టింపు అవుతాయి. ఎండు ద్రాక్షలను పాలల్లో నానబెట్టి తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయనే విషయాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎముకలను బలపరుస్తాయి:**
పాలలో నానబెట్టి ఎండు ద్రాక్ష తినడం వల్ల కాల్షియం, ఐరన్ మరియు విటమిన్ డి వంటి ముఖ్యమైన పోషకాలను అందుతాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అంతే కాకుండా ఇలా తినడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. అంతే కాకుండా ఎముకలు బలంగా మారతాయి. ముఖ్యంగా కీళ్లనొప్పులు లేదా ఇతర ఎముక సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు వీటిని తినడం వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయి.

**ఒత్తిడి మానసిక అలసట నుండి ఉపశమనం:**
ట్రిప్టోఫాన్ పాలలో ఉంటుంది. ఇది మెదడులో సెరోటోనిన్ (ఆనందాన్ని కలిగించే హార్మోన్) స్థాయిని పెంచుతుంది. తద్వారా ఒత్తిడితో పాటు ఆందోళనను తగ్గిస్తుంది. ఎండుద్రాక్షలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. ఎండుద్రాక్ పాలలో నానబెట్టి తినడం వల్ల ఒత్తిడి , మానసిక అలసటను తగ్గించడంలో సహాయపడుతుంది.

**జీర్ణ సమస్యలకు మేలు చేస్తుంది:**
ఎండుద్రాక్షలో ఫైబర్ , పాలలో ప్రోటీన్లు ఉంటాయి. ఇవి పేగులను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు జీర్ణక్రియ ప్రక్రియను సులభతరం చేయడంలో సహాయపడతాయి. అటువంటి పరిస్థితిలో, మీరు మలబద్ధకం, గ్యాస్ లేదా ఆమ్లత్వం వంటి జీర్ణ సమస్యలను ఎదుర్కొంటున్నట్లయితే ఎండుద్రాక్షను పాలలో నానబెట్టి తీసుకోవడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది.

**రక్తహీనతను తొలగిస్తాయి:**
ఎండుద్రాక్షలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్త లోపాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీంతో పాటు ఎండుద్రాక్షను పాలతో కలిపి తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. ఇది



శరీరానికి శక్తిని అందిస్తుంది. అంతే కాకుండా అలసటను తగ్గిస్తుంది. ఎండుద్రాక్ష, పాల కలయిక రక్తహీనతతో బాధపడేవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**రక్తపోటు తగ్గించడంలో ప్రయోజనకరంగా ఉంటుంది:**
ఎండుద్రాక్షలో పొటాషియం , ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తపోటును సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. పాలలో నానబెట్టిన ఎండు ద్రాక్షను తీసుకోవడం వల్ల శరీరంలోని రక్తహీనత తొలగిపోయి రక్తపోటు సాధారణంగా ఉంటుంది. ఈ మిశ్రమాన్ని రెగ్యులర్గా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

## సరికొత్త సీరియల్

# చాకిరేవు

**(గతవారం తరువాయి).**

అందుకే అందరూ కలిసి మాట్లాడుకున్నారు. గంగ ఏం మాట్లాడాలో, ఎలా అడగాలో దళితుల్లో కాస్త చదువుకున్నవాళ్లు, చైతన్యం ఉన్నవాళ్లు చెప్పారు. అనుకున్నదాని కంటే గంగ అనర్గళంగా మాట్లాడి కొండారెడ్డి దుమ్ము దులిపేసింది.

కొండారెడ్డికి కోపంగా వెళ్లిపోయాడు. దళితులు, బీదలు భలే అడిగావని గంగను అభినందించారు. అందరూ కలిసి గంగప్పన్న లాంటి మంచి మనిషిని గెలిపించుకోవాలని నిర్ణయించుకున్నారు కానీ వాళ్లలోనే ఒకరు ఎన్నికల్లో నిలబడవచ్చని అనుకోలేకపోయారు.

పట్టపగలే కొండారెడ్డికి గంగ చుక్కలు చూపించిందని వేముల మొత్తం తెలిసిపోయింది. పెద్దకోటయ్య, బాపనోళ్ళకు ఆవేశం పొడుచుకొచ్చింది. కొండారెడ్డి మద్దతుదారులైతే గంగను చంపేస్తామని, గంగ గుడిసెను కాల్చేస్తామని ఊగిపోయారు.

ఒకవైపు ఎన్నికల హడావిడిలో ఉండగానే పక్క పల్లె నుండి చాకలి కుటుంబం వేములకు రావడానికి తగిన ఏర్పాట్లు చేశారు. రెండు పల్లెల బట్టలను వాళ్లే ఉతకడానికి ఒప్పందం కుదిరింది. ఆ విషయం తెలుసుకున్న గంగ, గంగులు, అచ్చుక్క, దళితులు పక్క పల్లె చాకలి వాళ్ల ఇంటికి వెళ్లారు. గంగకు జరిగిన అన్యాయం గురించి చెప్పి వేములకు రాకూడదని, దానికి మీ సహాయం ఉండాలని అడిగారు.

'గంగకు జరిగిన అన్యాయం నిజమే కావచ్చు కానీ వచ్చిన అవకాశాన్ని ఎలా వదులుకునేది? రెండు పల్లెల్లో బట్టలు ఉతుక్కుంటే నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చని ఆశపడ్డాను. మీరు రావద్దంటే ఎలా?'

'గంగ కూడా మీ బిడ్డ లాంటిదే, మనకి మనమే సహాయం చేసుకోకపోతే, ఒక్కటిగా నిలబడకపోతే ఎలా? కొండారెడ్డి ఎంత నీచుడో చుట్టుపక్కల పల్లెలకు తెలుసు, మీకు తెలియదని మేము అనుకోవడం లేదు. గంగకు న్యాయం చేయాలంటే మీ కుటుంబం మాకు సహాయం చేయాలనీ చాకలి పెద్ద వినయంగా అడిగాడు.'

కాసేపు ఆలోచించుకున్న తర్వాత సరేనని ఒప్పుకున్నారు, వేములకు రాలేమని పల్లె పెద్దలకు చెప్పారు. పల్లె పెద్దలు చాలామందిని సంప్రదించారు కానీ ఎవరూ వేములకు వెళ్లడానికి ఇష్టపడలేదు.

గంగులు, దళితులు, బీదలు వేములకు రావాలనుకున్న చాకలి వాళ్ళను బుజ్జగించారు, కలిసి కట్టుగా ఉండాలని, ఆడబిడ్డకు అన్యాయం జరుగుతోందని వివరించారు. గంగ ముఖం చూసి ఎవరూ వేములకు వెళ్ళాలనుకోలేదు. దళిత–బహుజనులు ఉమ్మడిగా ఉంటే, కలిసి పని చేస్తే దేన్నైనా సాధించుకోవచ్చు.

సద్దిబట్టలు ఉతకడానికి వేములకు ఎవరూ పోకపోవడంతో బట్టలు పేరుకుపోయాయి. బట్టలు ఉతుక్కోవాలంటే అగ్రకులాల వాళ్లకు నామోషి, అహం, పొగరు. దళితులకు బట్టలు ఉతుక్కోవడం అలవాటు ఉంది కాబట్టి ఉతుక్కున్నారు.

వేములలో అగ్రకులాల వాళ్లు మాసిపోయిన, ఇస్త్రీ లేని బట్టలు వేసుకొని తిరుగుతుంటే దళితులు మాత్రం ఉతికిన బట్టలు వేసుకుంటున్నారు. అగ్రకులాలు సహించలేకపోయాయి, భరించలేకపోయాయి.

మిట్ట మీదున్న దామోదర్ రెడ్డి చనిపోయాడు. చనిపోయిన వాళ్ల బట్టలను కూడా చాకలి వాళ్లే ఉతకాలి. చనిపోయిన వ్యక్తుల బట్టలను ఇంట్లో ఉంచుకోరు, ఉతికిన తర్వాతే ఇంట్లో వాళ్లు వేసుకుంటారు.

వేములలో చాకలి లేడు కనుక దామోదర్ రెడ్డి ఖరీదైన బట్టలను ఉతికించుకోవడానికి గంగను పిలిచారు. బట్టలను ఉతకడానికి ఒక రేటు చెప్పింది. ముందు తీసుకునే ధర కంటే రెండు రెట్లు ఎక్కువ చెప్పినా వేరే మార్గం లేక సరేనని ఒప్పుకున్నారు. ఆ విషయం పంచాయితీ పెద్దలకు తెలిసింది. దామోదర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆరాదీశారు.

దామోదర్ రెడ్డి ఎలాంటి బట్టలు వేసుకుంటాడో, ఎంత ఖరీదైనవో మీకు తెలియంది కాదు. ఉతికించుకోకుండా ఇంట్లో ఎలా పెట్టుకోవాలి? ఎలా వేసుకోవాలి? పైగా చనిపోయినవాళ్ల బట్టలను ముట్టుకునే ఆచారం మాకు లేదు. పల్లెకు చాకలిని తెస్తారని చెప్పారు కాని తీసుకురాలేకపోయారు. ఇది తప్ప మరేదైనా మార్గం ఉంటే చెప్పండని ఎదురు ప్రశ్నించారు. పల్లె పెద్దల దగ్గర మరే మార్గం లేకపోవడంతో వెనుతిరిగారు. గంగ అనుకున్నది చేస్తోందని అగ్రకులాల వాళ్లకు కంటి మీద కునుకు లేకుండాపోయింది.

దేనికైనా ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటితే ఎవరైనా ఎదిరిస్తారు, ఎదిరించాలి. కులం, మతం, బీదరికం పేరుతో ఇంకెంత కాలం అగ్రకులాల ఆధిపత్యం? అగ్రకులాల అధికారాన్ని కుల్చాలి, అన్యాయాన్ని ప్రశ్నించాలి.

దామోదర్ రెడ్డి కుటుంబం తర్వాత కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, గంగిశెట్టి అలా ఒక్కకరుగా గంగ చేత ఎక్కువ డబ్బు ఇచ్చి మరి బట్టలు ఉతికించుకోవడం మొదలయ్యింది. దానితో కొండారెడ్డికి కోపం వచ్చి వేములలో ఉండే రెడ్లు, ఇతర అగ్రకులాలతో సమావేశం ఏర్పాటు చేశాడు.

'మనమంతా కలిసి కట్టుగా లేకపోతే ఎలా? బట్టలు పులివెందులలో ఉతికించుకుంటే సరిపోతుంది కదా?'

'చూడు కొండారెడ్డి, నువ్వంటే బాగా సంపాదించావు కాబట్టి ఎక్కడికైనా వెళ్లి బట్టలు ఉతికించుకోగలవు. మేము పేరుకే రెడ్లము కానీ నీలా సంపాదించలేదు. పైగా పులివెందులలో రెట్లు ఎలా ఉంటాయో తెలియదా?' సంజీవ రెడ్డి ప్రశ్నించాడు.

'అలాగని తక్కువ జాతి దానికి భయపడదామా? ఇదీ.. పని సమస్య కాదు జాతి సమస్య, అధికార సమస్య. దాన్ని అలానే వదిలేస్తే రేపొద్దున మనకు భయపడరు, గౌరవించరు, మన ఇళ్లల్లోకి వస్తారు, పక్కన కూర్చుంటారు, కలిసి తింటారు. అలగా జనాన్ని ఇళ్ళ వరకు రానిస్తే, మన ఆడపిల్లలను పెళ్లి చేసుకొని నెత్తి మీద కూర్చుంటారు, ఊరేగుతారు.'

'అవన్నీ మాకు తెలియదు, గంగ కాకుండా వేరే చాకలిని తెస్తే పర్వాలేదు లేదంటే మాకు వేరే దిక్కులేదన్నాడు కృష్ణారెడ్డి.'

కొండారెడ్డిని చాలామంది సమర్థించారు. తక్కువ కులం నాయాళ్ళు కొవ్వుతో కొట్టుకుంటున్నారు. ఇలానే వదిలేస్తే మన పక్కలో బల్లెమై కూర్చుంటారని అభిప్రాయపడ్డారు. గంగను ఎలా అయినా ఎదిరించాలని, ఈసారి సర్పంచ్ గా గెలిపిస్తే గంగను వేముల నుండి తరిమేస్తానని కొండారెడ్డి హామీ ఇచ్చాడు.

***

గత ఎన్నికల్లో కొండారెడ్డిని ఎవరూ ఎదిరించింది లేదు. తన మీద పోటీగా నిలబడిన వ్యక్తి నుండి తప్పా వేరే ఎవరి నుండి వ్యతిరేకత రాలేదు. ఈసారి ఎన్నికల్లో గంగ అంశం కొండారెడ్డిని ఉక్కిరిబిక్కిరి చేసింది. పైగా గంగతో కొండారెడ్డి అసభ్యంగా ప్రవర్తించాడని పల్లె మొత్తం తెలిసిపోయింది.

ఆదెన్న, పాపులమ్మ మరణించడం, పాపులమ్మ కుటుంబం మీద దొంగతనం నేరం, బట్టలు పోగొట్టారనే నెపంతో ఉచితంగా బట్టలు ఉతికించుకోవడం లాంటివి చాలామందిని తీవ్రంగా బాధించాయి. దాంతో కొండారెడ్డి కంటే గంగప్పన్న ఉంటే కాస్తలో కాస్తైన మేలనుకున్నారు.

రెండు రోజుల్లో ఎన్నికలు అనగా వెంకట్ రెడ్డి పులివెందుల నుండి సారాని తెప్పించి వేములలో నదిలా పారించాడు. పల్లె చివర కొండారెడ్డి జాగాలో పందిరి వేసి ఆడవాళ్లతో నగ్నంగా డ్యాన్సులు చేయించాడు.

మగవాళ్లు తాగారు, ఆడారు, మత్తెక్కిపోయారు. కొండారెడ్డి ఉంటే సారాకు ఇబ్బంది ఉండదనుకున్నారు. గంగప్పన్న మంచి, న్యాయం, సారా తాగితే ఆరోగ్యం చెడిపోతుంది, మరణిస్తారు లాంటి పనికిమాలిన మాటలు చెప్తాడు. బతికేది నాలుగు రోజులు తాగకుండా సుఖంగా, సంతోషంగా ఎలా బతికేది? దళితుల గుడిసెలకు ఓటుకు నోటు చేరింది. గతంలో కంటే ఎక్కువగా డబ్బు ఇచ్చాడు. చాలామంది పొంగిపోయారు, డబ్బుకు లొంగిపోయారు. ఎన్నికల్లో కొండారెడ్డి స్వల్ప ఓట్ల మెజారిటీతో గెలిచాడు.

సారా పంచకపోయుంటే, అమ్మాయిలతో నగ్నంగా డ్యాన్సులు చేయించకపోయుంటే, డబ్బు పంచకపోయుంటే తప్పకుండా గెలిచేవాడు కాదు. గెలిచిన వెంటనే వెంకట్ రెడ్డికి తెలిసిన చాకలిని వేములలో బట్టలు ఉతకడానికి పిలిపించాడు. గంగ దగ్గర ఎవరూ బట్టలు ఉతికించుకోకూడదని తీర్మానం చేశాడు.

కొండారెడ్డి వేములకు సర్పంచ్ అయినప్పటికీ పంచాయితీ పెద్దలను సంప్రదించ కుండా తనే సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం గంగప్పన్నతో పాటు పల్లె పెద్దలకు నచ్చలేదు. ఎంతకాలమని కొండారెడ్డి మాటే చెల్లించు కుంటాడు. పైగా గంగతో అసభ్యంగా ప్రవర్తించడం కూడా పంచాయితీ పెద్దలకు తెలిసింది.

కొండారెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమ బట్టలను గంగ దగ్గరే ఉతికించుకుంటామని, తమతో పాటు ఎవరైనా గంగ దగ్గర బట్టలు ఉతికించుకోవచ్చని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పల్లె పెద్దల్లో చీలిక వచ్చింది. సర్పంచ్ ఎవరైనా పల్లెకు సంబంధించిన గొడవలను మాత్రం పంచాయితీ పెద్దలే పరిష్కరించేవారు.

వేముల రెండు వర్గాలుగా చీలింది. దానికి ప్రధాన కారణం గంగ అయితే, అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి. కొండారెడ్డి పెత్తనాన్ని పల్లె పెద్దలతో సహా దళిత కుటుంబాలు కూడా భరించలేకపోయాయి.

వేరే పల్లెల్లో కులాలతో, మతాలతో సంబంధం లేకుండా జీవిస్తున్నారు. వేములలో మాత్రం స్వామి, కొండారెడ్డి, పెద్దకోటయ్య లాంటి వాళ్లు కులాన్ని, మతాన్ని అడ్డుపెట్టుకొని తక్కువ కులస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పులివెందుల నుండి వేములకు పిలిపించిన చాకలి ఇంటి మీదకు దళితులు వెళ్లారు. ఆడబిడ్డకు అన్యాయం ఎలా చేస్తావని నిలదీశారు. పల్లె వదిలి వెళ్లకపోతే జరిగే పరిణామాలకు మా భాధ్యత ఉండదన్నారు. దాంతో రాత్రికి రాత్రే తట్టా బుట్టా సర్దుకొని చాకలి పారిపోయాడు.

కొండారెడ్డి కోపం, ఆవేశంతో రగిలిపోయాడు. గంగ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని పంచాయితీ పెద్దలను, గంగను ఇంటికి పిలిపించాడు. గంగతో పాటు దళితులు, మరికొంతమంది వెళ్లారు.

'గతంలో గంగ కుటుంబానికి శిక్ష పడింది. మామూలుగా అయితే గంగ కుటుంబం ఉచితంగా బట్టలు ఉతకాలి. అలా చేయడం లేదు, పైగా డబ్బు కూడా ఎక్కువగా తీసుకుంటోంది. అదెలా న్యాయం అవుతుంది? గంగ ఉ



చితంగా బట్టలు ఉతకల్సిందేనని' కొండారెడ్డి వాదించాడు.

'దీనిపై ఇదివరకే నా నిర్ణయాన్ని చెప్పాను. బట్టలు కావాలని, నిర్లక్ష్యంతో పోగొట్టలేదు, ఒకవేళ మీరలా అనుకున్నా.. ఇప్పటికే గత కొన్ని సంవత్సరాలుగా నా కుటుంబం ఉచితంగా బట్టలు ఉతికింది కాబట్టి దానికి సరిపోతుంది.'

'ఇక డబ్బు పెంచడం గురించి మాట్లాడితే మీరు సర్పంచ్ గా గత పదేళ్ల నుండి పని చేస్తున్నారు. మీకు అప్పటి నుండి ఇప్పటివరకు ఒకే జీతం, ఆదాయం ఉన్నాయా? అలాగే స్వామి గారికి కూడా పూజలు చేసినందుకు జీతం ఇస్తున్నారు. ఆ జీతం గత పదేళ్ల నుండి పెరగలేదా? పెద్దకోటయ్య పులివెందులలో తక్కువకు సరుకులు తెచ్చి ఇక్కడ మూడింతలు ఎక్కువకు అమ్మడం లేదా? మీ జీతాలు, ఆదాయాలు పెరిగితే తప్పు లేదు కానీ నేను పెంచితే తప్పేంటి?'

గంగ నుండి ఊహించని ప్రశ్నలు వచ్చేసరికి కొండారెడ్డి చొక్కా తడిచింది, మాట మూగబోయింది.

పెద్దకోటయ్య, స్వామి కోపంతో ఊగిపోయారు. అప్పటిలా గంగను ఏమైనా మాట్లాడితే దళితులు, తక్కువ కులస్తులు ఊరికే ఉండరనే ఎరుక వాళ్లకు ఉంది కాబట్టి నలుగురిలో ఏమనలేకపోయారు. ఉమ్మడిగా ఉండటం వల్ల ఎలా పోరాటం చేయవచ్చో వేముల దళితులకు, బహుజనులకు తెలిసొచ్చింది. గంగతో పెట్టుకోవడం కంటే ఒక రేటు నిర్ధారించి బట్టలు ఉతికించుకుంటేనే మంచిదని పంచాయితీ పెద్దలు నిర్ణయించారు. గంగకు అందుకు కూడా సమ్మతించలేదు.

'అందరికీ ఒక ధరకు ఎందుకు ఉతకాలి? కొండారెడ్డి దగ్గర ఎక్కువ డబ్బు ఉంది కాబట్టి మనిషిని, వాళ్ల ఆర్థిక పరిస్థితులను, శ్రమను పట్టి ధర నేను నిర్ణయిస్తాను కానీ ధర నిర్ణయించే హక్కు మీకేక్కడిది? ధర మీరెందుకు నిర్ణయిస్తున్నారు? బట్టలు ఉతకడానికి ధర నిర్ణయించినట్లే పెద్దకోటయ్య సరుకుల అమ్మకంలో కూడా ఇంతకే అమ్మాలని మీరు నిర్ణయించగలరా? అలా చేయరు.. ఎందుకంటే పెద్దకోటయ్య, స్వామి, అగ్రకులాల జోలుకు వెళ్లరు. మీరంతా ఒక్కటే కాబట్టి వాళ్ల పనుల్లో వేలు పెట్టరు. దళితులు, బహుజనులు, బీదల మీదే మీ పెత్తనం, అధికారం చూపించారు, చూపిస్తూనే ఉన్నారు. ఇకనుండి వేములలో అది జరగదని' ఖరాఖండిగా చెప్పింది.

గంగ మాట్లాడుతుంటే తన గొంతు మాత్రమే కాదు వేములలో ఉన్న దళిత–బహుజనుల గొంతులు మోగాయి. ఇన్నేళ్ల నుండి తమలో తామే బలవంతంగా అణచిపట్టుకున్న విషయాలను గంగ ద్వారా గడ్డకు వేశారు.

గంగ దగ్గరే బట్టలు ఉతికించుకునేలా పంచాయితీ పెద్దలు నిర్ణయించారు. అయితే మరీ ఎక్కువగా కాకుండా తక్కువగా డబ్బు తీసుకోవాలని, గంగ మీద తమకు నమ్మకం ఉందని తేల్చారు. ఆ విధంగా గంగ వేములలో బట్టలు ఉతకడం ప్రారంభించింది. గంగను చూసి అచ్చుక్క, గంగులు తెగ మెచ్చుకున్నారు. గంగ తెలివితేటలకు గంగులు మురిసిపోయాడు. నిజానికి గంగ అన్ని మాటలు అంటున్నా పంచాయితీ పెద్దలు, కొండారెడ్డి మౌనంగా ఉండటానికి బలమైన కారణం గంగులు. ఆదెన్నలా గంగులు సౌమ్యుడు కాదు, ఏదైనా తేడా వస్తే చంపడానికైనా వెనుకాడడు. అందుకే కొండారెడ్డి కూడా కాస్త ఆచితూచి వ్యవహరించాడు.

@@@

పాపులమ్మ చనిపోయిన తర్వాత సుబ్బక్క ఆరోగ్యం మరింత చెడిపోయింది. విపరీతమైన జబ్బుతో బాధపడింది. ఎవరు పలకరించినా పాపులమ్మ కనపడిందా? కనపడితే గుడిసెకు పంపమనేది.

అన్నం తినడం మానేసింది, గంగ బలవంతంగా తినిపిస్తే కానీ తినేది కాదు. వంకగడ్డకు వెళ్లి పాపులమ్మను, ఆదెన్నను వెతికేది.

**(మిగతా వచ్చేవారం)**



**జాని తక్కెడశిల**
**7259511956**

# ఆధునిక క్రికెటర్లు అందుకోలేనంత ఎత్తులో బాపూ నాదకర్ణి రికార్డ్



**క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావంతో తమ అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పలువురు క్రీడాకారులు తమ తమ రంగాలలో రికార్డులు నెలకొల్పడం, కాలక్రమంలో ఇతరులు ఆయా రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త రికార్డులు సృష్టించడం సర్వసాధారణమైన విషయమే. అయితే దశాబ్దాలైనా కొన్ని రికార్డులు అలాగే అభేద్యంగా ఉండిపోవడం మనకు ఆశ్చర్యం కలిగించక మానదు. అలాంటి రికార్డుల్లో జనవరి 12, 1964న భారత్ మరియు ఇంగ్లాండ్ జట్ల మధ్య చెన్నైలో జరిగిన టెస్ట్ మ్యాచ్ లో ఎడమచేతి వాటం స్పిన్నర్ నాసిక్కు చెందిన రమేష్చంద్ర గంగారాం బాపూ నాదకర్ణి నెలకొల్పిన రికార్డు ఒకటి.**

1964లో భారత్ మరియు ఇంగ్లాండ్ జట్ల మధ్య చెన్నైలో జరిగిన టెస్టో బాపు నాదకర్ణి అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా వరుసగా 21.5 మెయిడెన్ ఓవర్లు (131 బంతులు) బౌలింగ్ చేయడం ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన విషయం అని చెప్పవచ్చు. ఆయన నెలకొల్పిన ఈ రికార్డు బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. మైక్ స్మిత్, కెన్ బారింగ్టన్, డాన్ విల్సన్ వంటి ఇంగ్లాండ్ బ్యాట్స్మెన్లు అతని బౌలింగ్ ఎదుర్కొని పరుగులు రాబట్టలేకపోయారు. భారతదేశం తరపున టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ఆడి అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసిన వారిలో నాదకర్ణి ఒకరు కావడం విశేషం.






**బాపూ నాదకర్ణి ప్రత్యేకత:**

లైన్ మరియు లెంగ్త్లో ఏ మాత్రం తడబడకుండా ఖచ్చితంగా బౌలింగ్ వేయడంలో నాదకర్ణి సిద్ధహస్తుడు. దీని వలన బ్యాట్స్మెన్కు ఆయన బౌలింగ్ లో పరుగులు రాబట్టడం దాదాపు అసాధ్యం. నెట్స్లో ప్రాక్టీస్ చేసేటప్పుడు అతను పిచ్పై ఒక నాణెం ఉంచి ప్రతి డెలివరీ కూడా  ఆ నాణెంపై పడేలా అత్యంత దీక్షతో ప్రాక్టీస్ చేసేవాడని చెబుతారు. తత్ఫలితంగా, బ్యాట్స్మెన్ అతను వేసే డెలివరీలను రక్షణాత్మకంగా (డిఫెండ్) ఆడడమో లేదా వాటి నుండి తక్కువ పరుగులు రాబట్టడమో చేసేలా ఆయన తన బౌలింగ్ను అభివృద్ధి చేసుకున్నాడు.

(మిగతా 8వ పేజీలో)

( 7వ పేజీ తరువాయి)


అతని కెరీర్ ఎకానమీ రేటు ఓవర్కు 2.00 పరుగుల కంటే తక్కువ అని తెలిస్తే ముక్కు మీద వేలు వేసుకోవాల్సిందే మరి. 1963%-%64లో ఇంగ్లాండ్తో జరిగిన మద్రాస్ టెస్ట్లో మూడవ రోజు (ముగింపు రోజు), అత్యధికంగా బ్రియాన్ బోలస్ మరియు కెన్ బారింగ్టన్లకు బౌలింగ్ చేసిన అతను 29 ఓవర్లలో 26 మెయిడెన్లు మరియు మూడు పరుగులకు వికెట్లు ఏమీ తీసుకోకుండా అద్భుతమైన గణాంకాలు నమోదు చేసాడు. మొత్తం మీద అతను 32 ఓవర్లు, 27 మెయిడెన్లు, 5 పరుగులు మరియు సున్నా వికెట్లతో ముగించాడు. 114 నిమిషాల బౌలింగ్ స్పెల్లో వరుసగా ఇరవై ఒక్క మెయిడెన్ ఓవర్లు (వరుసగా 131 డాట్ బాల్స్) బౌల్ చేశాడు. అంతేకాదు, ఆ సిరీస్లోని చివరి టెస్ట్లో, ఆయన మొదటి ఇన్నింగ్స్ లో 52 మరియు రెండవ ఇన్నింగ్స్ లో 122 పరుగులు చేసాడు. ఇది టెస్ట్ క్రికెట్లో అతని ఏకైక సెంచరీగా మిగిలిపోయింది. 1964-65లో మద్రాసులో ఆస్ట్రేలియాపై నాదకర్ణి 31 పరుగులకు ఐదు వికెట్లు 91 పరుగులకు 6 వికెట్లు తీసుకున్నాడు. కానీ బిషన్ సింగ్ బేడి ఎడమచేతి వాటం స్పిన్నర్గా ఆవిర్భవించడంతో, అతని అవకాశాలు పలుచనయ్యాయి. 1967లో ఇంగ్లాండ్ పర్యటన నుండి అతన్ని తొలగించినప్పటికీ ఆ శీతాకా లంలో వెల్లింగ్టన్, న్యూజిలాండ్లో అతను 43 పరుగులకు 6 వికెట్లు పడగొట్టి కెరీర్లో అత్యుత్తమ గణాంకాలతో భారత్కు విజయాన్ని అందించాడు. ఈ పర్యటన నుండి తిరిగి వచ్చిన తర్వాత, అతను ఫస్ట్-క్లాస్ క్రికెట్ నుండి తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అతను 41 మ్యాచ్లలో కేవలం 88 వికెట్లతో కానీ 1.67 ఎకానమీ రేటుతో రిటైర్ అయ్యాడు.

### రంజీ ట్రోఫీలో నాదకర్ణి:

నాదకర్ణి 1951-52 నుండి 1959-60 వరకు రంజీ ట్రోఫీలో మహారాష్ట్రకు మరియు ఆ తర్వాత 1967-68 వరకు బాంబేకు ప్రాతినిధ్యం వహించాడు. 1957-58లో సౌరాష్ట్రకు వ్యతిరేకంగా అతను 201 పరుగులు చేయడమే కాకుండా 17 పరుగులకు 6 వికెట్లు మరియు 38 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. 1958-59లో గుజరాత్తో జరిగిన మ్యాచ్లో ఏడు వికెట్లు తీసుకున్నాడు.







1960-61లో ఢిల్లీతో జరిగిన సెమీఫైనల్ లో ఆరు గంటల పాటు ఆడి 283 పరుగులు చేయడం అతని అత్యధిక స్కోరు. అతను జాతీయ జట్టు అసిస్టెంట్ మేనేజర్గా పనిచేశాడంతో పాటు సునీల్ గవాస్కర్కు గురువుగా కూడా ఉన్నారు.

### భారత క్రికెట్ చరిత్ర:

క్రికెట్ ఆటను ప్రప్రథమంగా 17 మరియు 18వ శతాబ్దాలలో ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నావికులు మరియు వ్యాపారులు భారత ఉపఖండంలో పరిచయం చేసినట్లు చెబుతారు. భారతదేశంలో మొట్టమొదటి క్రికెట్ క్లబ్ 1792లో కోల్కతాలో స్థాపించబడినట్లు తెలుస్తోంది. భారత క్రికెట్ పితామహుడుగా పిలవబడే సర్ రంజిత్సిన్జీ విభాజీ జడేజా నవానగర్ (ఇప్పటి జామ్ నగర్, గుజరాత్) లోని సదోదర్ అనే గ్రామంలో జన్మించారు. ఆయన క్రికెట్ ప్రస్థానం 1883లో రాజ్కుమార్ కళాశాలలో ప్రారంభమైంది. మొదటి సారిగా పాఠశాలకు ప్రాతినిధ్యం వహించిన అతను 1884లో కేవలం 12 సంవత్సరాల వయసులో కెప్టెన్గా నియమించబడ్డాడు. అయితే 1926లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆహ్వానం అందుకున్న భారతదేశం 1932లో ఇంగ్లాండ్లో టెస్ట్ ఆడే దేశంగా అరంగేట్రం చేసింది.

( మిగతా 9 పేజీ )



( 8వ పేజీ తరువాయి)



ఇంగ్లాండ్ మరియు భారత్ జట్ల మధ్య లండన్లోని లార్డ్స్లో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ కు ఆ సమయంలో అత్యుత్తమ భారతీయ బ్యాట్స్మన్గా పరిగణించబడే సి కె నాయుడు నాయకత్వం వహించారు. జూన్ 25 నుండి 28 వరకు జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు భారత జట్టుపై 158 రన్స్ తేడాతో విజయం సాధించింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, "పోయిన చోటే వెతుక్కోవాలి" అన్న సామెత లాగా సరిగ్గా 51 సంవత్సరాల తరువాత, 1983 జూన్ 25న, కపిల్ దేవ్ నేతృత్వంలోని భారత జట్టు లార్డ్స్లో బలమైన వెస్టిండీస్ను ఓడించి క్రికెట్ ప్రపంచ కప్పు గెలుచుకుని చరిత్ర సృష్టించడం భారత క్రికెట్ అభిమానులందరికీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

**తొలితరం ప్రఖ్యాత క్రికెటర్లు:**

అమర్ సింగ్ టెస్ట్ క్రికెట్లో టెస్ట్ క్యాప్ అందుకున్న మరియు అర్ధ సెంచరీ సాధించిన తొలి భారతీయుడు. అతను భారతదేశపు తొలి ఫాస్ట్ బౌలర్ మరియు ఆల్ రౌండర్ కూడా. 1939–40 మరియు 1941–42లో జాతీయ సెలెక్టర్ గా వ్యవహరించిన జహంగీర్ ఖాన్ కుడిచేతి వాటం బ్యాట్స్మన్ మరియు కుడిచేతి మీడియం పేసర్ కూడా. దూకుడు బ్యాట్స్మన్ గా పేరొందిన లాల్ సింగ్ భారతదేశం తరపున టెస్ట్ క్రికెట్ ఆడిన మొదటి సిక్కు. జనార్ధన్ నవ్లే భారతదేశం తరపున ఆడిన మొదటి వికెట్ కీపర్ బ్యాట్స్మన్. 1932లో భారత్ మరియు ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ మైదానంలో జరిగిన మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్ కెప్టెన్ సి కె నాయుడు. భారత టెస్ట్ క్రికెట్ జట్టు మొదటి సభ్యుడు సోరాబ్జీ కోలా. 1884లో 12 సంవత్సరాల వయస్సులో రాజ్కుమార్ కళాశాల కెప్టెన్గా ఎంపికైన సర్ రంజిత్సిన్హ్జీ విభాజీ జడేజా (ఈయన పేరనే "రంజీ ట్రోఫీ" నిర్వహించబడేది) అన్ని కాలాలలోనూ గొప్ప బ్యాట్స్మెన్లలో ఒకరిగా పరిగణించబడ్డాడు. తన తరంలో భారతదేశం యొక్క బలమైన టెస్ట్ జట్టు సభ్యుడిగా పరిగణించబడిన వ్యక్తి బిషన్ సింగ్ బేడి. అదే తరానికి చెందిన ఇతర జట్టు సభ్యులు శ్రీనివాస్ వెంకటరాఘవన్, ఎరపల్లి ప్రసన్న, భగవత్ చంద్రశేఖర్. 1970–71లో వెస్టిండీస్లో భారతదేశం తరపున అరంగేట్రం చేసిన సునీల్ గవాస్కర్ టెస్ట్ క్రికెట్ లో ప్రపంచంలోనే అత్యధికంగా 34 సెంచరీలు సాధించిన క్రికెటర్ గా (2005 లో దీన్ని సచిన్ టెండూల్కర్ బద్దలు కొట్టాడు), 10 వేల పరుగులు సాధించిన మొదటి భారతీయుడు లాంటి చాలా రికార్డులు నెలకొల్పాడు.


**తిరుగులేని బాపూ నాదకర్ణి:**

ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే "న భూతో న భవిష్యత్" అనిపించేలా జనవరి 12, 1964న అనిపించేలా బాపూ నాదకర్ణి తన 21.5 మెయిడెన్ ఓవర్లతో నెలకొల్పిన రికార్డు అత్యంత అరుదైన విషయం అని చెప్పవచ్చు. ఆరు దశాబ్దాలైనా ఆ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆయన నెలకొల్పిన ఈ రికార్డు బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. బాపూ నాదకర్ణికి ఇష్టమైన పదం "ఛోడో మత్" (వదలద్దు). 17 జనవరి 2020న బాపూ నాదకర్ణి మరణానంతరం తన సంతాపాన్ని తెలియచేస్తున్న సందర్భంలో గవాస్కర్ మాట్లాడుతూ "ఛోడో మత్ – తుమ్ భారత్ కే లియే ఖేల్ రహే హై" (వదలద్దు – నువ్వు భారతదేశం తరపున ఆడుతున్నావు) అనే వారిని గుర్తుచేసుకున్నారు. భారత దేశానికి ఇంతటి ఘనకీర్తి సాధించిపెట్టిన అంతటి గొప్ప క్రికెటర్ కు ఆయన వర్ధంతి సందర్భంగా జోహార్లర్పిద్దాం!

**యేచన్ చంద్ర శేఖర్ ✆ 8885050822**

# నెట్ వర్క్

## ఈవారం కథ



ఆరు మాసాల క్రితం వరకూ ఈ ఊరు అస్సలు పరిచయంలేదు. ఉద్యోగరీత్యా అమ్మ తో కలిసి ఈ ఊర్లో ఉంటున్నాను. పెళ్లి, పిల్లా జెల్లా లేని ఒంటరి వాణ్ని. అందుకనేమో అమ్మ నాతో ఉండడానికి ఎక్కువ ఇష్టపడుతుంది. నా కన్నా పెద్ద పిల్లలు, అక్క అన్న వారి వారి కుటుంబాల తో ఉన్నా అమ్మ వారి దగ్గర ఎక్కువ ఉండదు. కాదు,కాదు వారే ఉండనివ్వరు. చేతలలో సాగనంపి, మాటల్లో ప్రేమ కురిపిస్తుంటారు. ఈ ఊళ్లో కాలనీ వాళ్లు గానీ, ఆఫీసు బయట మరెవరూ పరిచయం కాలేదు. నాక్కూడా అది లోటనిపించలేదు. ఒంటరి తనం ఫీల్ కాలేదు. అందుకు సోషల్ మీడియాకు థ్యాంక్స్ చెప్పాలి. ఫేస్ బుక్ లో 5 వేల మంది, వాట్సాప్ గ్రూపులు ఒక ఇరవై. రోజంతా స్నేహితులతో బిజీగా ఉంటున్నట్టే. చిన్నప్పటి క్లాస్ మేట్ గ్రూపు, డిగ్రీలోని గ్రూపు, ఆఫీసు గ్రూపు, వృత్తి స్నేహితులది, స్వచ్ఛంద సంస్థలదీ... ఒకటేమిటి, సవాలక్ష. చర్చలూ, జోకులూ, వాదోపవాదాలు. ఈ ఊళ్లో ఉన్న వాళ్ల దగ్గర నుండి ఖండాంతరాల్లో ఉన్న వాళ్ల వరకూ. అన్నట్టు మా అక్కా, అన్న వారి పిల్లలు కూడా బయట కన్నా, సోషల్ మీడియా లోనే బాగా పలకరి స్తుంటారు. అమ్మకు మూడు రోజులుగా ఆరోగ్యం బాగులేదు. హాస్పిటల్ లో చేరింది. మిత్రుల రెస్పాన్స్ నాకు ఓదార్పు ఇచ్చింది. ఫేస్ బుక్, వాట్సప్ మెసేజ్ లు వరదలయ్యాయి. తిరిగి ధన్యవాదాలు చెప్పడం కూడా అసాధ్యం. రోజంతా కూర్చుని టైప్ చేసినా పూర్తయ్యేసరికి వారం పడుతుంది. అన్న కూడా వీడియో కాల్ చేశాడు.. 'అమ్మ జాగ్రత్తరా. బిజీగా ఉన్నాం. రాలేం. ప్రస్తుతానికి డబ్బులేమైనా అవసరమైతే పంపిస్తాను' అంటూ.' అవసరం లేదులే' అని చెప్పాను. గతంలో రెండ్రోజులు అమ్మ వారింట్లో ఉన్నప్పుడు వదిన చేసిన హంగామా, తెచ్చిపెట్టుకున్న పోట్లాట, మరి నీ ముఖం చూడమంటూ తెచ్చి మాయింట్లో దింపడం అన్నీ గుర్తున్నాయి. అవన్నీ మర్చిపోయి ఇలా మామూలుగా ఎలా మాట్లాడగలరు అని ఆశ్చర్య పోయాను కూడా. వీటన్నిటికీ పరాకాష్ట అన్నయ్య తన వాట్సాప్ డీపీగా అమ్మ ఫోటో పెట్టుకుని, సెంటిమెంటు పండించడం.

***** ***** *****

చూస్తుండగానే అమ్మ పరిస్థితి క్షీణించింది. భౌతిక జీవితం నుండి సెలవు తీసుకుంది. చెప్పాల్సిన వారికి చెప్పాను. ఫేస్ బుక్, వాట్సాప్ మిత్రులకు తెలియ జేశాను. అంతిమ యాత్ర కు ముందు ఇంటికి తీసుకు వచ్చాను. ఆఫీసు వాళ్లు సాయానికి వచ్చారు. నాతోనే ఉన్నారు కార్య క్రమం పూర్తయ్యే వరకూ. కాలనీ వాళ్ల ఒక్కొక్కరు వచ్చి పరిచయం చేసుకున్నారు. చొరవ తీసుకుని పనులకు ముందు కొచ్చారు. ఏ భేషజమూ లేకుండా కలిసి పోయారు. ఒంటరినన్న భావం కలగ నీయకుండా అంతా ఒక కుటుంబం అనుకునేలా ప్రవర్తించారు. బంధువులు మొక్కుబడిగా వచ్చి వెళ్లినా బాధనిపించ లేదు, అది వారి సంస్కారం కదా అనిపించింది. వెనక్కి తిరిగి చూస్తే ఆశ్చర్యమనిపించిందల్లా, ఫేస్ బుక్ మిత్రులు. ఒక్కరూ ఫేస్ చూపించలేదు. ఊళ్లోనే ఉన్న కవిమిత్రులు. మానవ సంబంధాలు, సున్నితత్వం పై కుండల కొద్దీ కవిత్వాన్ని ఒంపేవారు, రెండడుగులు వేసి స్నేహం కొద్దీ వచ్చి భుజం పై చెయ్యి వేద్దామనుకోలేదు. చుట్టూ పక్కల నగరాల్లోనే ఉన్న స్కూల్, కాలేజీ మిత్రులు కూడా.

ఫేస్ బుక్, వాట్సాప్ తెరిచాను. అమ్మ ఆత్మశాంతి కోసం మెసేజ్ ల తో నిండిపోయాయి. అక్క, అన్న, వదినె ఆమెతో ఉన్న పాత ఫోటోలు పెట్టి చాట భారతం రాసి ఉన్నారు వాల్ మీద. కృత్రిమ ప్రేమ వర్షం కుంభ పోతలుగా కురుస్తోంది. ఊరట కలగలేదు. చిరాకు వచ్చింది. ఎకౌంట్లు డిలీట్ చేద్దామని లేచాను. అప్పుడే ఆయన వచ్చాడు.

"అయాం సారీ సర్. మీ అమ్మగారి మృతికి బాధ పడుతున్నాను."

"థ్యాంక్స్ అండి. మిమ్మల్ని పోల్చుకోలేదు."

"నేను మీ ఫేస్ బుక్ లో ఫాలోయర్ ని అండి. మీ పోస్టులెప్పుడూ ఫాలో అవుతాను. ఎక్కువగా స్పందించను గానీ మీరంటే మంచి మిత్రునిలా భావిస్తాను."

"ఓ. సురేష్ గారు కదూ. ఫేస్ బుక్ లో ఫోటోకీ, మీకూ వ్యత్యాసం కనబడుతోంది. అయినా పూనే లో ఉంటారు కదా"

"అవున్సార్. అక్కడి నుండే వస్తున్నాను. ఒక్క సారి కలిసి మీకు నా సానుభూతి తెలపాలనిపించింది" గుర్తు పట్టానన్న ఆనందం ఆయన మొహంలో కనబడుతోంది.


"అయ్యో. అంత దూరం నుండి రావాలా? రండి. ఫ్రెష్ అప్ అవుదురు గానీ."

ఇప్పుడు నా మనసు ఫ్రెష్ అయ్యింది. సోషల్ మీడియా అకౌంట్లు డిలీట్ చెయ్యను. అవసరం లేనివి అన్ ఫ్రెండ్ చేస్తానంతే. సమాజమైనా, సామాజిక మాధ్యమైనా పరిచయాల్ని ఇస్తాయి అంతే.అసలైన మిత్రుల్ని అందులోంచి జాగ్రత్తగా ఎంచుకోవాల్సింది మనమే.

సమాప్తం

**డా. డి వి. జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం,విజయనగరం. 944083691.**

# ఇలాంటి వారు ఉంటారా?



ఇది బరువెక్కిపోయిన గుండెతో చెప్పిన మాట. మనుషులు మారిపోయారు , మమతలు దూరమయ్యాయి అనడం ఒట్టి అపద్దం.మనుషుల మధ్య బందువుల మధ్య బంధాలు, అనుభంధాలు లేని ఈ కాలంలో ఒక పెద్దాయన దేనిపైన బంధం పెంచుకున్నారో చెబితే మీరే ఆశ్చర్య పోతారు. ఇంకా అలాంటి వ్యక్తులు ఉన్నారా అని ఆలోచిస్తూ మీ ఊర్లో కూడా అలానే బ్రతికే మరొకరిని కచ్చితంగా తలుచుకుంటారు.ఇవన్నీ నేను వేదంతంగా చెప్పలేదు.నేరుగా చూసినది , చెవులారా విన్నది మాత్రమే చెబుతున్నా. నా పేరు సూర్యనారాయణ శర్మ. మాది వేదాంతం అగ్రహారం.నేను ఈ ఊరికి పురోహితున్ని మాత్రమే కాదు హితాన్ని కూడా కోరేవాణ్ణి. మా ఊళ్ళో ఉన్నది ఒకే ఒక శివాలయం . అది చాలా పురాతనమైనది .పూజలు , పునస్కారాలు చేసే వారి మొదలు రెండు చేతులెత్తి ఒక్క నమస్కారంతో దైవానుగ్రహం పొందాలి అనుకునేవారు అందరూ అక్కడికి వస్తుంటారు. అందరినీ శివయ్య ఒకేలా చూస్తుంటాడు.

ఒకప్పుడు వేద పాఠశాల నడిపిన శ్రీ శ్రీ రామనాథ శాస్త్రి గారు గుడికొచ్చి ఎక్కువ సేపు అక్కడే గడిపే వారిలో ఆయన ప్రథముడు.సరదాగా అందరితో కబుర్లు చెప్పి కాలక్షేపం చేసే మనిషి కాదు ఆయన.

ఆయనకు ఇద్దరు కొడుకులు ఒకరు అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్, మరొకరు పొరుగు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగి.

ఇద్దరికీ తలొక పై పంచ వేసేశాడు.ఇద్దరు ఎవరి కాళ్లపై వాళ్ళు నిలబడ్డారు.ఈయన వేదపాఠశాల నడిపి అందులో వచ్చిన డబ్బుతో కాదు పిల్లలను చదివించింది.ఈయన దగ్గర నేర్చుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ రాష్ట్రంలో వేరు వేరు ప్రాంతాలలో పేదరికంలో ఉన్న వారే.

చదవాలన్న ఆకాంక్ష,ఆతృత ఉన్నవాళ్ళందరినీ ఆయన చేర్చుకొని ఉచితంగా భోజనం ,వసతి కల్పించి మరీ అక్కడే విద్య నేర్పించేవాడు.కొడుకులు కూడా ఒక్క నయాపైసా తండ్రి దగ్గర ఖర్చు పెట్టించ కుండా గవర్నమెంటు పాఠశాలలో చదివిన వారే.

"ఇంతమంది పిల్లలకు వేదం నేర్పుతున్నాను.మీలో కనీసం ఒక్కడైనా నేర్చుకోండిరా " అని ఆయన ఏనాడూ వాళ్ళను అడగలేదు.

వాళ్లకు నేర్చుకోవాలన్న శ్రద్ధ ఉంటే వాళ్ళే వస్తారని ఆయన నమ్మకం.ఆయన భార్య అన్నపూర్ణ . నిజంగానే పేరుకే కాదు సాక్షాత్తు అన్నపూర్ణే.ఆకలితో ఎవరినీ, అరకడుపుతో మరెవరినీ ఉంచదు.అమ్మా నాన్నలు లేని లోటు ఆ పాఠశాలలో విద్యార్థులకు ఏమాత్రం తెలియకుండా చేసేది.

ఇక పాఠశాల నడపడానికి ఆ ఊర్లో మాన్యం భూమిపై వచ్చే సంపాదనను వినియోగించుకునేవాడు.మాన్యం భూమిలో ధాన్యం విరివిగా పండేవి. మరికొంత భాగంలో ఆకుకూరలు కూరగాయలు పండించేవాడు. కౌలుకిచ్చి ,పాఠశాల తో పాటు కుటుంబం కూడా నడపగలిగేంత పంటనిచ్చే మాన్యాలు అవి.

ఆయనకు ఎప్పుడూ ఆ పొలాల పైన వచ్చే సంపాదన తన కుటుంబం కోసం కొంత దాచుకుందామని ఏనాడు అనిపించలేదు ఏమో అది ఆయన మనస్తత్వం.

నేను ఇందాక మొదట్లో అన్నాగా ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆలోచన అని, అవి మంచి కావచ్చు చెడు కావచ్చు అన్నట్టు రెండు పుట్టేవి మనిషి మెదడు నుండే కదా.

భూములపై మనుషులకు విపరీతమైన ఆశ మొదలైంది. ఊరిలో పేరు మోసిన పెద్దలు, తెల్లచొక్కా లేసిన పెద్దలు , టక్కులు చేసిన మరికొందరు ,బాగా చదువుకున్నోళ్లు అందరూ కలిసి ఊళ్లో ఉన్న మాన్యాలని ప్రభుత్వం తీసుకొని ఊర్లోని పేదలకు పంచమని పంచాయితీ చేసి అందులో తలో చేయి వేసి తాము పేదోళ్లు అనిపించుకున్నారు.

ఎదిరించే ధైర్యం లేదు ఎదురు తిరిగి నిలబడే స్థాయి ఆయన దగ్గర లేదు. దీంతో ఉన్న భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే దానిపై వచ్చే ఆదాయంతో నడిపేపాఠశాలను శాశ్వతంగా మూసేశాడు. కానీ దానిపై ఉన్న మమకారం వదులుకోలేక ఒక్క విద్యార్థిని మాత్రం చేర్చుకుని వారిని గుడికి తీసుకొచ్చి ఇక్కడే పెద్ద మర్రి చెట్టు కింద కూర్చోబెట్టి పాఠం చెబుతుంటారు.

***********

ఉన్నట్టుండి ఊర్లో పెద్ద వరద వచ్చింది.వర్షం మొదలై మూడు రోజులైంది వానజడి ఏమాత్రం ఆగడం లేదు. పక్కనే ఉన్న అన్ని పిల్ల కాలవల మొదలు వాగులు వంకలు అన్ని ఒక్కొక్కటిగా ఊరిని చుట్టుముట్టేస్తున్నాయి.ఉరుముల శబ్దాలు ఎవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

మెరుపుల వెలుతురులు చిమ్మ చీకట్లో భయాన్ని వెతికి బయటపడేస్తున్నాయి. చిన్న ధారలా వచ్చిన వరద పెరిగి పెద్దదైన నీళ్ల ధాటికి ఇళ్లన్నీ , సామాన్లన్నీ, ఒక్కొక్కటిగా కొట్టుకుపోయాయి. మొండి గోడలు మాత్రం మాకేం సంబంధం లేనట్టు నిల్చున్నాయి. ఇక గ్రామంలోని వారందరూ ఒట్టి చేతులతో శివయ్య ఉన్న చోటుకు వచ్చి ప్రాణాలు నిలబెట్టుకున్నారు.

అంతా మాయలా జరిగిపోయింది. బీద –సాదా, రాజు– ధనిక అందరూ ఒకటై పోయారు.ప్రాణనష్టం జరగలేదు కానీ ఆస్తి నష్టం అపారం. అది విలువ కట్టలేనిది. నిజంగా ముసలి ముతక బయటపడ్డారంటే మాత్రం అదృష్టమనే చెప్పాలి.ఇది జరిగిన మరుసటి రోజు అందరికీ భయం పట్టుకుంది. ఇక ఇక్కడే ఉంటే ఇలానే మనం ప్రతిసారి బయటపడలేం కదా అని అందరిలో మెదులుతుంది. ఎవరి పాటకి వాళ్ళు ఊరు వదిలి వేరే చోటుకు వెళ్లాలని నిర్ణయాలు తీసుకుంటున్నారు. రామనాథ శాస్త్రి గారి ఇద్దరు పిల్లలు కూడా "ఇకమీద ఇక్కడ ఉండటం ఏమాత్రం క్షేమం కాదు . అక్కడ మమ్మల్ని అందరూ నానా మాటలు అంటున్నారు. మీరు ఇంత స్థాయిలో ఉండి మీ అమ్మానాన్నలను గాలికి వదిలేసారని పెద్ద మాటలతో ఎత్తి పొడుస్తున్నారు.ఇన్ని రోజులు మేము కూడా ఇది అంత శ్రద్ధగా చెవికెక్కించుకోలేదు.కానీ ఈరోజు జరిగిన పరిస్థితి చూస్తే ఈ విషయంలో మీకు ఏదైనా జరిగి ఉంటే అందరూ అన్నట్టుగానే మేము జీవితాంతం దోషులుగా మిగిలిపోయే వాళ్ళం" అంటూ మా ఇద్దరిలో ఎవరి వద్దనైనా సరే వచ్చి ఉండమని బలవంతం చేశారు.

"కానీ రామనాథ శాస్త్రి మాత్రం నాకు కొన్ని రోజులు సమయం ఇవ్వండి "అని చెప్పి వాళ్ళ బాధ అర్థం చేసుకుని ఒక నిర్ణయం తప్పక తీసుకుంటానని చెప్పారు. దీంతో అన్ని వసతులు మళ్ళీ కల్పించి ఇద్దరు వారికి కాస్త సమయం ఇచ్చి వెళ్లారు.ఒకవైపు అన్నపూర్ణమ్మకు కూడా దిగులు చుట్టుకుంది.వయసు మీద పడుతుంది కదా జరగరానిది జరిగితే ఇక్కడ దిక్కు ఎవరు. ఇంకా ఇక్కడ మనం ఎవరున్నారని ఉండాలి అంటూ దిగులు చెందుతోంది.

*********

ఒకరోజు సాయంత్రం రామనాథ శాస్త్రి ఎప్పటిలాగే శివాలయం కు వచ్చారు.అందరూ భక్తులు అప్పటికే వచ్చి వెళ్లారు.ఒంటరిగా నంది పక్కన కూర్చున్న ఆయన శివయ్య అడ్డ విభూది నామాల మధ్యలో ఉన్న ఎర్రటి కుంకుమ తిలకాన్ని తదేకంగా చూస్తున్నారు.

ఓవైపు బయట అంతా చల్లని గాలులు వీస్తుంటే రాతి గోడల మధ్య నిర్మించిన శివాలయంలో మాత్రం గోరువెచ్చదనం ఒంటికి తగులుతుంది.కళ్ళతో మెల్లగా మనసులో మాటలు చెబుతున్నారు రామనాథశాస్త్రి "ఏమయ్యా మా అమ్మానాన్న ఇదే మట్టిలో పుట్టి ఇదే నీళ్లు తాగి ఇదే గాలి పిలుస్తూ ఇక్కడే ప్రాణం ఉన్నంతకాలం హాయిగా ఉండి చనిపోయారు.

నేను పుట్టి పెరిగింది ఇక్కడే మా నాన్న చేయి పట్టి నడక నేర్పిందిఇక్కడే, మా అమ్మ చేతి రుచి చూసింది ఇక్కడ పండిన పంటతోనే, నాకు అబ్బిన ఈ వేద విద్య నీ ముందర కూర్చోబెట్టి మా నాన్న నేర్పిందే కదా. అందరూ వేరే ఊర్లలో ఉంటున్నారు కదా అని, ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని ,సరైన సౌకర్యాలు లేవని అనేక సాకులతో అందరిలాగా నన్ను కూడా ఈ ఊరు వదిలి వెళ్ళిపోమంటావా? లేక నాకొన ఊపిరి వదిలే దాకా ఇక్కడే ఉండమంటావా" నువ్వే చెప్పు..

అయినా నాక్కూడా ఈ ఊరిలో నీతో ఉన్నది కేవలం లౌకిక బంధం కాదు అది అలోకికం చెప్పలేనిది , చెప్పిన ఎవరికీ అర్థం కానిది .

ఒకరికి భార్య మీద , మరొకరికి కొడుకుల మీద, ఇంకొకరికి అన్నదమ్ములు – అక్క చెల్లెల మీద , మరో పక్క స్నేహితులు, ఆస్తులు – పాస్తులు ,డబ్బు అనేక వాటిపై బంధాన్ని ఏర్పరచుకొని ఉంటారు.అలాగే నాకంటూ ఒక బంధం ఉండకూడదా? అది కేవలం అందరికీ నచ్చేదై ఉండాలా? నాకు ఇక్కడ ఉండడం అంటే ఇష్టం .నా అన్న ప్రదేశంలో ఎంత హాయిగా ఉంటుందంటే ఓ పూట అన్న పానీయాలు లేకపోయినా అలసట తెలియనంత .అయినా నీకు తెలియనిదా చెప్పు నాకు ఇక్కడ ఏ రోజైనా కాస్తయినా సుస్థి చేసిందా చెప్పు?నీతో ఉన్న అనుబంధం ఎలాంటిది? నువ్వు సర్వాంతర్యామివి అన్ని నువ్వే , అన్ని చోట్ల నువ్వే కానీ నిన్ను ఇక్కడ ఇలా చూస్తుంటే నాకు ఎంత ఆనందము ఉంటుందో నీకు తెలియదా చెప్పు? ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

మొదటిసారి మనసులో ప్రశ్నల వర్షం కురుస్తుంది. ఒకింత కలవరింతగా ఉంది. అలజడి కాస్త జడివాన పట్టుకున్నట్టు పట్టుకుంది. ఏం చేయమంటావు" అంటూ మాట్లాడుతున్నాడు.

మధ్యలో వచ్చిన నేను ' అయ్యా , ఇక సెలవు తీసుకుందామా స్వామికి ఏకాంత సేవ చేయాలి" అన్నాను. వారి మధ్యన కలిగిన అసౌకర్యానికి మనసులో చింతిస్తూ.

"ఓ తప్పకుండా స్వామి" అన్నారు వారు.ఆయన తీర్థం పుచ్చుకుని , శఠరి తలపై పెట్టించుకొని , ఓ పువ్వు స్వామి వారి ప్రసాదంగా తీసుకొని ఇంటికి బయలుదేరారు.

ఇంటికెళ్ళి పువ్వు అన్నపూర్ణమ్మ చేతికిచ్చి జడలో పెట్టుకోమన్నారు.కడుపునిండా భోజనం చేసి,తాంబూల చర్వణం చేశారు. ప్రశాంతంగా రాగి మరచెంబులో నీళ్ళు పక్కన పెట్టుకొని ఎప్పటి లాగే నాలుగు దేవుని శ్లోకాలు చదువుకుంటూ పడుకున్నారు.

తెల్లారి సూర్యుడు రాక మునుపే అన్నపూర్ణమ్మ లేచి ఇంటి ముందు కసువు తోసి ముగ్గు పెట్టి , స్నానం చేసి, తులసి చెట్టుకు నీళ్ళు పోసుకొంది.ఈ సమయానికి ఆయన కూడా నిత్య కాల కృత్యాలు తీర్చుకొనే వారు. ఇంకా మగతగా పడుకున్నట్టు ఉన్నారు.

దగ్గరికెళ్ళి ఎంత బిగ్గరగా పిలిచినా , ఎంతో గట్టిగా చేతితో తట్టినా చలించలేదు. ఆయన ఏమాత్రం మౌనం వీడలేదు.నిన్న ఆయన శివుణ్ణి అడిగిన ప్రశ్నలన్నింటికీ తెరపడింది.ఇంకెవరినీ ప్రశ్నించలేనంత దూరం వెళ్ళిపోయారు. ఎవరి ప్రశ్నలూ వినలేనంత నిశబ్దం పాటించారు.

ఇదంతా చూసిన నాకు మాత్రం ఒక వ్యక్తి తాను పుట్టిన ఊరిపై కాదు నెలపై ఇంత అనుభందం ఉంటుందా అని అప్పుడే అనిపించింది.ఏదైనా ఒక బంధం నిజంగా ఇంత బలంగా ఉంటే ఎంత బాగుంటుంది అనిపించింది. నాకూ అలాంటి వాటిలో దేనిపై బంధం ఉందో వెతుకులాడే ప్రయత్నం మొదలు పెట్టాను.

**లోకా సమస్తా సుఖినోభవంతు**

**సింగంపల్లి శేష సాయి కుమార్,**
**8639635907**

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి

91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com

# 19.1.2025 నుంచి 25.1.2025 వరకు

## మేష రాశి



అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

అనవసరస్నేహలకై వృధా ఖర్చులు, అలవాట్లు వలన ఇబ్బందులు. ఆరోగ్య రీత్యా తగిన జాగర్తలు అవసరం. ఉద్వేగం కోపం నియంత్రించుకోవాలి. శత్రువులు ఇబ్బంది, రోగానిరోధక శక్తి పెంపోందించుకోవాలి. ఋణముల విషయం లో అప్రమత్తం.సామజికసేవ చేస్తారు. ఆధ్యాత్మిక వ్యక్తుల కలయిక, పుణ్యనదీ స్నానములు,మీ సంబంధ న్యాయ విషయములకై మంతనములు. ఖర్చులు నియాంత్రించుకోవాలి. అప్పులు చేసితీర్చే ప్రయత్నాలు. వారము మధ్యలో జీవిత భాగస్వామి ద్వారా ఆర్థిక సహకారము. కుటుంబములో కొంత ఆహ్లాద వాతావరణము. విద్యార్థులు శ్రమ అధికము.తల్లి తండ్రుల సలహా తోడ్పాటు. వారము చివరిలోమానసిక ఆరోగ్యము శ్రద్ధ.ఆహారము కొత్త ప్రదేశాల్లో తీసుకునేటపుడు జాగర్త అవసరము.

## వృషభరాశి



కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

విద్యార్థులకు విద్యా సంబంధ అంశాల్లో రాత నైపుణ్యాలు తగిన విధంగా ఆసక్తి పెంచుకోవాలి. డివియేషన్సు స్నేహ సంబంధాలు వల్ల విద్యా సంబంధ ఇబ్బంది అధికంగా ఉంటాయి. ఉప సనాబలం పైన శ్రద్ధ తీసుకుంటూ నైరశ్యాన్ని దూరం చేసుకుని ముందుకు సాగాలి. ఆలోచనలో ఆలస్యాలు ఉన్నప్పటికీ ముఖ్యమైన శ్రేయోభిలాషుల యొక్క సలహా సహకారంతో సమస్యల అధికమిస్తారు.మానసిక ఒత్తిడి సమస్యలు అధికంగా ఉన్నప్పటికీ యోగ మెడిటేషన్ మొదలైంది చేయడం వల్ల మంచిది. స్నేహితుల సలహా సహకారంతో సంతానం విషయంలో నూతన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్లడానికి మీరు చేసే కార్యక్రమాలలో వృత్తిపరంగా ఉన్నత స్థాయి వ్యక్తుల సహకారం కూడా లభిస్తుంది. కుటుంబంలో వ్యక్తులకి వృత్తి అవకాశాలు లభిస్తాయి.

## మిధున రాశి



మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ఈ రాశి వారికి ప్రారంభంలో విద్యాపరమైన నూతన విషయాలు తెలుసుకుంటారు తల్లి యొక్క ఆరోగ్యం మీద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు గృహవాతావరణం, ముఖ్యంగా గృహంలో చిన్నపాటి రిపేర్లు వాహనానికి సంబంధించిన అం శాలు కొంత చికాకులు కలిగిస్తుంది. అయినప్పటికీ వాటిని మీ యొక్క తెలివితేటలతో అధిగమిస్తూ ముందుకు వెళతారు. విద్యార్థులకు విద్యాపరమైన విషయాలు మీద తగిన శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా పరీక్షలు రాసేటప్పుడు శ్రీహయగ్రీవాయనమః మంత్రాన్ని పట్టించడం చాలా మంచిది. వారం మధ్యలో నూతన సృజనాత్మకమైన నిర్ణయాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్వేగాలని నియంత్రించుకుంటూ ముందుకు వెళ్లవలసిన అవసరం ఉంది.

## కర్కాటక రాశి



పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వ్యక్తుల సహకారం తీసుకోవడానికి మనసు నిరాకరిస్తుంది. కమ్యూనికేషన్ విషయంలో కొంత ఇబ్బందులు అధికంగా ఉంటాయి మాట్లాడవలసిన సమయంలో మాట్లాడకపోవడం వల్ల కూడా కొన్ని అవకాశాలు కోల్పోయే రీత్యా మీరెంత జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. ఆత్మీయ వ్యక్తుల సహకారంతో చెప్పవలసిన మాటలను చక్కగా చెబుతూ ఫలితాలు సాధించాలి. ప్రయాణం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మధ్యవర్తిత్వాలు అగ్రిమెంట్లు పనికిరాదు. వారం మధ్యలో గృహ వాతావరణం వాహనాన్ని సంబంధించిన విషయాలు, సౌకర్యాలు, నూతన గృహ నిర్మాణ విషయంలో ఆగిన పనులు కొంత చర్చకు రావడం జరుగుతుంది. ఆర్థికంగా కొంత చికాకులు ఉన్నప్పటికీ అధిగమిస్తారు.

## సింహ రాశి



మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో ఆర్థికంగా ఖర్చులు అధికంగా ఉంటాయి రావలసినదని రావడంలో కొంత ఆలస్యాలు ఉంటాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కొంత కష్టంగా ఉంటుంది కుటుంబ వ్యవహారాలలో ఇతరుల జోక్యం కొంత విసుగును కలిగిస్తుంది. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. వారం మధ్యలో వృత్తికి సంబంధించిన విషయాలలో అవలీలగా ముందుకు వెళతారు. ఆగుతూ వస్తున్న పనులు ముందుకు పెడతాయి. సంకల్ప బలం పెరుగుతుంది కమ్యూనికేషన్ బాగుంటుంది వ్యక్తులు సహకరిస్తారు మిత్రులతో కలిసి చర్చలు చేసి నూతన ఆలోచనలకు శ్రీకారం చుడతారు. దగ్గర ప్రయాణాలు చేస్తారు. మిత్రుల కొరకు ఖర్చులు అధికం చేస్తారు. మీ ఇంటికి బంధువులు రాక. తల్లితండ్రుల సహకారంతో గృహ ప్రయత్నాలు,

## కన్యా రాశి



ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆధ్యాత్మిక ధోరణి, నైరాస్యమైన ఆలోచనలు, మీ మీద మీకు శ్రద్ధ తక్కువగా ఉంటుంది. ప్రవచనాలు మొదలైన వాటి మీద ఆసక్తి అధికంగా ఉంటుంది . మానసిక ప్రశాంతత తక్కువగా ఉండటం వల్ల అందరికీ దూరంగా ఉంటారు. అయినప్పటికీ అవన్నీ మీ మనోబలంతో జయించే ప్రయత్నాలు చేయాలి. ముఖ్యంగా తల్లి జీవిత భాగస్వామితో కలిసి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలని కోరిక బలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి కుటుంబ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. వాయిదా పడుతూ వస్తున్న ఎదురుచూస్తున్న ధనాన్ని కొంతైనా అందుకుంటారు. వృత్తిపరమైన ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి. విద్యార్థులకు విద్యాపరమైన వస్తువులు కొనుగోలు

## తులారాశి



చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ప్రారంభంలో ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు ముఖ్యంగా కంటికి సంబంధించిన విషయాలలో జాగ్రత్తలు అవసరము ఆధ్యాత్మిక వ్యక్తుల్ని కలుసుకుంటారు వారి ఆశీస్సులు తీసుకుంటారు ట్రస్టులు మొదలైన వాటికి విరాళాలు ఇస్తారు. శారీరక శ్రమ అధికంగా ఉంటుంది తగిన విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉంది. వృత్తిపరంగా అధిక బాధ్యతలు ఆలోచనలు మొదలైన వాటి వల్ల శ్రమ, సమయానికి ఆహార స్వీకరణ తీసుకోకపోవడం వల్ల కొంత అనరోగ్య భావనలు. వారం మధ్యలో వ్యక్తిగత ఆలోచనలు బాగుంటాయి శారీరక శ్రద్ధ పెరుగుతుంది నిర్ణయాలు తీసుకుంటారు మీ యొక్క వృత్తిలో నూతన అభివృద్ధి కొరకు విశేషంగా శ్రమ పడతారు. జీవిత భాగస్వామితో కలిపి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు.

## వృశ్చిక రాశి



విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ప్రారంభంలో మీ సేవలకు తగిన గుర్తింపు గౌరవం లభిస్తుంది దూర ప్రదేశాల్లో ఉండే మిత్రులతో సంభాషణ. వారసత్వపాస్తుల విషయంలో కుటుంబ వ్యక్తులతో అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. వచ్చిన లాభాలను సద్వినియోపరుచుకునే విషయంలో కూడా అనాసక్తి వైరాగ్య భావనలు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక లాభాలు, ఒక సమాచారం ఆలోచనలు కలిగిస్తుంది. వారం మధ్యలో కుటుంబపరమైన ముఖ్య కార్యక్రమాలు, దైవ సందర్శన, ఖర్చులు అధికంగా ఉంటాయి. నిద్రలేమి ఆహార లోపం చికాకును కలిగిస్తాయి. ఇప్పటిదాకా మందకొడికే సాగిన ఆర్థిక విషయాలు ఓ కొలిక్కి వస్తాయి. వారం చివరిలో సంకల్ప బలం పెరుగుతుంది. ఉన్నత స్థాయి వ్యక్తుల సహకారం బాగుంటుంది. ఆశించిన ఫలితాలు పొందుతారు. వృత్తిపరమైన అభివృద్ధి. నూతన విషయాలు వింటారు.

## ధనస్సు రాశి



మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తికి సంబంధించిన విషయాలు మీద ఆసక్తి తక్కువగా ఉంటుంది. అనవసర వ్యక్తుల జోక్యం వల్ల వృత్తిలో చికాకులు అధికం. చేస్తున్న వృత్తి మారే ఆలోచనలు అధికం చేస్తారు. అలాంటి ఆలోచనలు నియంత్రించుకుంటూ యోగా మెడిటేషన్ మొదలైనవి చేయడం మంచిది. ఖర్చులు శక్తికి మించి ఉండడం వల్ల చికాకులు పెరుగుతాయి. మీ తెలివితేటలతో వాటిని అధిగమించగలుగుతారు. రహస్య శత్రువుల వల్ల నైపుణ్యాలు పెరుగుతాయి కృషి పెరుగుతుంది. విద్యార్థులు విద్యకి సంబంధించిన విషయాలలో చాలా గట్టిగా కృషి చేస్తారు. వారం మధ్యలో ఆర్థిక సంబంధమైన విషయాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. భాగస్వామికి వృత్తిపరమైన విషయాలలో ఉన్నత స్థాయి వ్యక్తులు రాజకీయ నాయకుల యొక్క సహకారం తోడ్పాటు లభ్యమవుతుంది.

## మకర రాశి



ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామి యొక్క ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి సామాజిక సేవ చేస్తారు, తగిన గుర్తింపు ఆశించిన స్థాయిలో లభ్యం అవటం లేదని ఒక రకమైన అసంతృప్తి ఉన్నప్పటికీ మీ పుణ్య బలముతో దాన్ని జయించే ప్రయత్నాలు చేస్తారు. తండ్రి పెద్దలు గురువుల ఆశీస్సుల లభ్య మవుతాయి. ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసే వారికి అనుకూలంగా ఉంటుంది దూర ప్రయా ణాలకు అవకాశం ఉంటుంది ఆధ్యాత్మిక ప్రదేశాలు సందర్శించడానికి ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి. వారం మధ్యలో వృత్తికి సంబంధించి నిర్ణయాలు మార్పు చెందుతాయి, ముఖ్యంగా జీవిత భాగస్వామికి వృతిపరమైన అభివృద్ధి ఏర్పడుతుంది. రుణములు చెల్లించుటకు మీరు చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి.

## కుంభ రాశి



ధనిష్ట 3,4 పాదములు శతబిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో రహస్య శత్రువుల వల్ల ఇబ్బంది అధికంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి , ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి ప్రయాణాల విషయం జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. వస్తువులని అజాగ్రత్తగా వదిలేయకూడదు ప్రయాణాలలో నూతన వ్యక్తులని నమ్ముతూ ముందుకు వెళ్లేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. నూతన ప్రదేశాలలో ఆహార స్వీకరణ, ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తండ్రి యొక్క బంధువులు మీ ఇంటికి రాక,చేసే కార్యక్రమాల్లో అసంతృప్తి, ఆధ్యాత్మిక అంశాల్లో ఆటంకాలు, దూర ప్రయాణాలు, విద్యార్థులు పోటీలలో శ్రమతో విజయాలు, విదేశీ విద్యకై ఆలోచనలు, ఆకస్మిక ధన రాబడి, భాగస్వామ్యం వ్యవహారాల్లో నూతన ఆలోచనలు, ఎ

## మీనరాశి



పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో జాయింట్ వెంచర్స్ గురించి దృష్టి సారిస్తారు. జీవిత భాగస్వామి అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మీ విషయంలో శ్రద్ధతో నిర్ణయాలు, భాగస్వామ్య విషయాల్లో అశ్రద్ధ ఉండడం వల్ల అపార్థాలకు అవకాశం ఉంది. దూర ప్రయాణాలకు అవకాశం. ఆధ్యాత్మికుల దీవెనలు అందుకుంటారు. వారం మధ్యలో సంతానం యొక్క ఆరోగ్యమే శ్రద్ధ తీసుకుంటారు. మీ ఆలోచనలు మీకే వ్యతిరేకంగా ఉండడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉపాసన విషయంలో ఆటంకాలు. కుటుంబంలోని ఇష్టమైన వ్యక్తుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. జీవిత భాగస్వామి వృత్తిపరమైన అభివృద్ధి. కమ్యూనికేషన్ బాగుంటుంది. సంతానముతో కలిసి వారి అభివృద్ధి విషయంలో నూతన నిర్ణయాలు చేస్తారు.



సన్నీ లియోన్